# సీతమ్మ పెళ్ళి ::

- శ్రీ ఘట్టి -
కృష్ణమూర్తి

వాడికి పెళ్ళౌతుందంటే అందరికీ విడ్డూరంగానే వుంది. ఆమాటవిన్న ప్రతివాడికీ ఒకటే తహతహ. "అసలు పెళ్ళి యెట్లా జరుగుతుందో, వాడికివొచ్చే పెళ్ళాం, అదెట్లా వుంటుందో" అని.

"వీడిపెళ్ళికోసరం పాకులాడడం నవ్వులపాలు కావడమే" అనేవుద్దేశ్యంతో, ఇన్నాళ్ళనించీ తల్లి తండ్రులు కూడా నిమ్మకి నీరెత్తినట్లు మెదలకుండా ఊరుకున్నారు. ఇప్పుడు హఠాత్తుగా "మావాడి పెళ్ళోండోయ్" అని వాళ్ళనాన్న యెవరిచెవులో భాకా వూదాడుట. వాడగట్టంతా అట్టే "గుప్పు"న వ్యాపించింది.

నలుగురునుంచున్నచోట యెక్కడ చూసినా, ప్రతివాడినోట్లోనూ, ఇదేమాట, "మన పోతుగాడి పెళ్ళటరోయ్" అని దారేపోతూంటో యెవరో పిలిచారు. అందరికీ తెలిసినదీ, చాలా పాపుల్యర్ గా వున్నదీ మాత్రం యీపేరు ఒక్కటే. పేరువిషయంలోనే మరోచిన్న ఇతిహాసంకూడా చెప్పుకుంటూండడం కద్దు. "వీడికంటే ముందు నలుగురైదుగురు పిల్లలు పుట్టిపోవడం సంభవించిందట. వీడు పుట్టగానే అందరూ అన్నారు. ఆ వీడుమాత్రం బ్రతికి బట్టకట్టేకాడా" అని. అక్కడికీ తల్లిప్రాణం వూరుకోక పుట్టగానే పుల్లాకుల్లో వేసి పొర్లించి "పుల్లిగాడు" అని పేరుపెట్టిందట. రాను రాను ఆ పేరు న్యూటబ్యూగా లేదని, దేవుడుపేరుకూడా అయినట్లు వుంటుందని "పోతరాజు" అని పిలవడం మొదలుపెట్టారు—ఇది మహోనాజూకుగా వున్నట్లు,—మరీ చనువుయెక్కువయేసరికి 'రీపోతుగాడు" అనిఖాయం చేశారు.

వాడే లోకువగా వుండడంచేత అందరూ పని చెబుతూంటారు. పనంటే...మరేపనీ కాదులెండి. ఏడిచేపిల్లల్ని వీపుమీదఎక్కించుకుని, నోట్లో తాడు పెట్టుకుని ఛో, ఛో, గుర్రంలాగ నడివీధిలో పాకడం. చిన్నప్పుడూ పెద్దప్పుడూ, అన్నివేళలా వాడికి చేతనయింది ఇదొక్కటే—ఇప్పటికి వాడికున్న రెండుడజన్లన్నరయేళ్ళలోనూ ఆ వాడగట్టునున్న పిల్లలంతా వాడివీపుమీద యెక్కి బండీ తోలినవాళ్ళే. మొట్టమొదటగా యెక్కినవాళ్ళు ఇప్పుడిప్పుడు వాళ్ళకథల్లో పోతరాజు సంగతికూడా వ్రాసుకుంటూనే వుంటారు.

ఎప్పుడూ మాట్లాడడు. మాట్లాడినా కొత్తవాళ్ళైతే గ్రహించడం బహుకష్టం. అది ముద్దమాట. అనుకోడానికూడా వీలులేదు...మనంకాస్త తెలివిగలవాళ్ళమైతే దానికి పేరు పెట్టకుండా వుండడం కొయ్య...కాదు, లక్షరెట్లు మెరుగు, మనిషిగా వున్నాడు కనుక, మనుషులకుండే కొన్ని భావాలు వాడిలోకూడా ఏమూలనో నలుసుల్లాగా వున్నాయని మనం పొరపాటున అనుకున్నా, అవి ఆవిష్కరించడం వాడిచేతకాదు. తలనేలవేసి కొట్టుకున్నా మన చేత అసలేకాదు.

వాడిని గురించే మంచిగాగానీ చెడుగాగానీ, మాట్లాడుకుంటున్నారని బెంగ అంతకంటె లేదు. ఒకతరహా పోజులో ఎక్కడైనా అలాగే నడిచి పోతుంటాడు. ఇక వాడికేమీ సంబంధం లేదని మెదలకుండా వూరుకుండడానికి వీలులేదు. పెళ్ళి ఖాయమైంది. ముందు జరగబోయేదాన్ని గురించి తగినశ్రద్ధ తీసుకోకపోతే వీలులేదు. ఎవరితో ఎలామాట్లాడాలో ఎవరిని ఏమండీ అనాలో, వరసావాయి తెలియదు మరి!—ఇక నివ్వాళనించే విఘ్నేశ్వరపూజప్రారంభం.

ఎంతపరిజ్ఞానం వున్నదో వాడి దగ్గరమంచి ముందుగా రాబట్టాలనుకున్నారు—అందుకు మామూలుగా వుండేవాడెవడూ సరిలేడు ...అందుకు తగిన వాడినేఒకణ్ణి నియమించారు...ఇప్పటికి...వాడిదగ్గి

రనుంచి కొన్నిమాటలు రాబట్టడం, మరికొన్నికొత్తవి నేర్పడం జరుగుతూన్నకార్యక్రమం... అయినా చెప్పివూరుకుంటె జ్ఞాపకంవుంటాయని నమ్మక మేమిటి? అన్నీ ప్రాక్టికల్‌గా వాడిచేత అనిపించాలి... "వొరేవ్ నేనే, నీమామగార్ని అనుకో ఎట్లాపిలుస్తావ్?—వీడేమో ఇంకా మర్యాదగా పిలుస్తాడని ఎదురుచూస్తూంటాడు "వొరేయ్" అని వాడి నోటివెంట, ఆలోచించుకోకుండానే వస్తుందిమాట. ఒక నిర్ణీత ధ్వనిలో వాళ్ళనాన్న తన్నుపిలుస్తున్నా, ఇతరులుపిలుస్తున్నా వినపడేది తరుచుగా అదొక్కమాట... ఎలాగో ఆరోజుకి ఒక మాటొచ్చిందని తృప్తిపడి వూరుకుంటే మర్నాటికి వాడి సహజ దశలోకి వెళ్ళిపోతాడు. ఇకమనమాట, చస్తే వినిపించుకోడు. మానీటర్‌తో వాళ్ళనాన్న ఒకటే మాట చెప్పాడు. వావివరసలు చెప్పడానికేమాడుగాని, వాడి వుచ్చారణమార్చడానికి సుతరామూ ప్రయత్నించకు. అందుకు కష్టాలుపడితే అసలు మొదలే చెడుతుంది" అని...

* * *

ఇహను అక్కడి సంగతి—ఇంతకుముందే ఒక సంబంధం కుదురుతుందను కున్నారు సీతమ్మకి. "మాకేమీకట్నాలూ కానుకలూ అక్కర్లేదు. పిల్ల బాగుంటే, బుద్ధిమంతురాలైతే. మేమేతీసుగెళ్లి చేసుకుంటాం, నాలుగులక్షరంముక్కలు కూడా వొస్తే మరీమంచిది, అన్నారు వాళ్లు. ఒకనాడు సీతమ్మని చూసుకెళ్లారు, పాటా పద్యం పాడించారు. తాము కోరినవన్నీ సీతమ్మలో మూర్తీభవించినై" అనుకొన్నారు—అతను కూడా తప్పక చేసుకుంటానన్నాడు. పెళ్ళికాగానే చదువుకూడా చెప్పించుదామనుకున్నాడు.


కథాంజలి

విడిప్రతి 0–3–0

సంవత్సర చందా 3–4–0

(ప్రత్యేక సంచికలతోసహా)


ఒకనాడు వాళ్లు తాంబూలాలు పుచ్చుకుందామనే బయలుదేరుతుండగా, ఒంటి బ్రాహ్మణుడు తయారు. ఎదురుగుండా శకునం సరిగా లేదని లోపలికివెళ్ళి సరిగా కూచున్నారో లేదో, ఎదురుపడిన విప్రవతంసుడు లోపలకు వచ్చి అరుగుమీద ఆసీనుడయాడు, వాడంతట వాడే చెప్పటం మొదలు పెట్టాడు కూడా. "మీరు, తాంబూలాలు పుచ్చుకోడానికే బయలుదేరారని నాకు తెలుసు ఎదురుగుండా వొస్తే తిట్టిపోస్తారనీ నాకు తెలుసు. అయినా తోటివాళ్లు, తెలియక గోతిలోపడుతుంటే చూస్తూ ఎలా వూరుకుంటాను కనుక మీతో వొక విషయం ఖచ్చితంగా చెప్పడానికే వొచ్చాను" అని.

వాళ్ళకూడా అనుమానంతోచింది, "ఏమిటి నాయనా తప్పకుండా చెప్పు" అని అదుర్దాగా అడిగారు.

"ఈ సంబంధం మానుకోండి, మీకు ఇంతకంటే శ్రేష్ఠమైన సంబంధం కుదురుస్తాను. ఆ అమ్మాయి పెద్దమనిషై ఆరునెల్లైంది. ఆ సంగతి వాళ్లు మీకు చెప్పరు. ఇంకా......" అంటూండగానే, వాళ్లు అందుకుని "ఇంకా దానికితోడు యేమైనా వుంటై. అంతటితో మాకు చాలండి. ముందుగానే తెలిస్తే ఆ చాయలకైనా వెళ్లేవాళ్లంకాదు" అన్నాడాయన. తరువాత సీతమ్మ తండ్రి యెక్కడో కనపడితే ఇష్టమొచ్చినట్లు మాట్లాడాడు. ఇక నీ జన్మలో మీ పిల్లకి సంబంధం కుదురుతుందా? అని కూడా బెదిరించాడు—అయినా కొడుకు మాత్రం సీతమ్మనే చేసుకోవాలనడం, తండ్రి గదమాయిస్తే వూరుకోడం జరుగుతూంది.

(సశేషం)